క్లుప్తంగా

ప్రభుత్వాస్పత్రిలో న్యాయవిజ్ఞాన సదస్సు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో గల వన్ స్టాప్ సెంటర్‌లో న్యాయవిజ్ఞాన సదస్సును శుక్రవారం నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీనివాసులునాయక్ మాట్లాడారు. వన్ స్టాప్ సెంటర్ ఏఓ షెహనాజ్, న్యాయవాది దుర్గాంబ, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి చర్యలు



నెల్లూరు(క్రైమ్): నిత్యం విధుల్లో నిమగ్నమై ఉండే సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్పీ విజయారావు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ వెల్ఫేర్ డేను శుక్రవారం నిర్వహించారు. వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది పలు సమస్యలను ఎస్పీకి తెలియజేశారు. ఏఎస్పీ హిమవతి, ఎస్ఈబీ శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు రాగిజావ





పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో రాగిజావ తాగుతున్న విద్యార్థులు (ఫైల్)

- సర్వేపల్లి నియోజకవర్గంలో మూడునెలలుగా అమలు
- సీఎం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి కాకాణి

పొదలకూరు: 'జగనన్న గోరుముద్ద'లో రాగిజావను చేర్చి సర్వేపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాలతో గత మూడు నెలలుగా పొదలకూరు, ముత్తుకూరు, మనుబోలు, వెంకటాచలం, టీపీ గూడూరు మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగిమాల్ట్‌ను అందిస్తున్నారు. ఇందుకోసం సాయిష్యూర్ కంపెనీ నుంచి ప్రతి పాఠశాలకు రాగిపిండి ప్యాకెట్లను సరఫరా చేస్తున్నారు. విద్యార్థులు బలంగా ఉండడంతోపాటు చదువుపై శ్రద్ధ పెంపొందేందుకు పౌష్టికాహారం దోహదపడుతుందనే ఉద్దేశంతో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. పాఠశాలల్లో హెచ్‌ఎంలు రోజు విడిచి రోజు ఒకరోజు రాగిజావలో బెల్లం కలుపుతూ, మరొక రోజు సాల్ట్ వేసి విద్యార్థులకు అందిస్తున్నారు.



రాగిజావ రుచి చూస్తున్న ఆర్‌జేడీ సుబ్బారావు (ఫైల్)

సర్వేపల్లిలో అమలు ఇలా..

సర్వేపల్లి నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఉన్న మొత్తం 373 పాఠశాలల్లో మంత్రి కాకాణి ప్రోత్సాహంతో విద్యార్థులకు రాగిజావను అందజేస్తున్నారు. ఇందుకోసం మంత్రి కాకాణి తన సొంత నిధులను వెచ్చిస్తున్నారు. పొదలకూరు మండలంలో 103 పాఠశాలలు, ముత్తుకూరు మండలంలో 71, టీపీ గూడూరు మండలంలో 68, వెంకటాచలం మండలంలో 78, మనుబోలు మండలంలో 53 పాఠశాలలకు రాగిమాల్ట్‌ను అందజేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. గుంటూరు ఆర్‌జేడీ సుబ్బారావు సైతం పొదలకూరు జెడ్పీ హైస్కూల్లో రాగిజావను తాగి ఈ కార్యక్రమం అమలుపై అభినందనలు తెలిపారు.

ముఖ్యమంత్రి దృష్టికి..

సర్వేపల్లి నియోజకవర్గంలో విద్యార్థులకు రాగిజావ అందజేసే కార్యక్రమం విజయవంతం కావడంతోపాటు పిల్లలకు తృణధాన్యాలతో కూడిన పౌష్టికాహారం అందుతుండడంతో మంత్రి కాకాణి ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించి జగనన్న గోరుముద్ద పథకంలో అదనంగా రాగిజావను చేర్చుతూ ఆదేశాలను జారీ చేశారు. వారానికి రెండు పర్యాయాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రాగిమాల్ట్‌ను అందజేస్తామని సీఎం ప్రకటించారు. విద్యార్థుల పౌష్టికాహారం అందించడంపై వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హైవే మొబైల్ పోలీసులకు ఎస్పీ అభినందన



హైవే మొబైల్ సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ విజయారావు

నెల్లూరు(క్రైమ్): వృద్ధుడి ప్రాణాలు కాపాడి మానవత్వం చాటుకున్న హైవే మొబైల్ పోలీసులను ఎస్పీ సీహెచ్ విజయారావు శుక్రవారం నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించారు. వివరాలిలా ఉన్నాయి. వెంకటేశ్వరపురానికి చెందిన యానాదయ్య అనే వృద్ధుడు అలిగి ఇటీవల ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం ఆయన కొడవలూరు మండలం రాజుపాళెం సమీపంలోని పొలాల్లోని బురదలో అపస్మారకస్థితిలో పడిపోయి ఉండడాన్ని పెట్రోలింగ్ నిర్వహిస్తున్న హైవే మొబైల్ సిబ్బంది వెంకటప్రసాద్, సుధాకర్ చూశారు. వారు వెంటనే స్పందించి యానాదయ్యను బురదలో నుంచి బయటకు తీసి స్నానం చేయించి దుస్తులు వేశారు. అనంతరం కోవూరు వైద్యశాలకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. వృద్ధుడి ద్వారా అతడి కుటుంబసభ్యుల వివరాలు సేకరించి వారికి అప్పగించారు. దీంతో వృద్ధుడి కుటుంబసభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. సిబ్బంది చర్యలను ఎస్పీ అభినందించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ జి.శ్రీనివాసరావు, ఎంటీఓ పాల్‌రాజు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

హత్య కేసు నమోదు చేసిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్): అల్లుడి చేతిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందారు. దీంతో హత్యాయత్నం కేసును హత్య కేసుగా పోలీసులు మార్చారు. వివరాలు.. కళాకారుల కాలనీలో బబ్లూ అలియాస్ గౌస్, సమీనా దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు మగపిల్లలు. గౌస్ టైల్స్ పాలిషింగ్.. సమీనా ఇంట్లోనే టైలరింగ్ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మద్యానికి బానిసైన గౌస్ భార్యపై అనుమానం పెంచుకున్నారు. మద్యం మత్తులో తరచూ ఆమెతో గొడవపడేవారు. టైలరింగ్ సామగ్రి కోసం పక్కనే ఉన్న దుకాణానికి గతేడాది డిసెంబర్ 28న ఆమె వెళ్లొచ్చారు. ఈ క్రమంలో ఫూటుగా మద్యం తాగి ఇంటికొచ్చిన గౌస్ భార్యను తీవ్రంగా కొట్టారు. దీంతో ఆమె తన తండ్రి అహ్మద్ జానీ (61)కి ఫోన్ చేశారు. ఇంటికి చేరుకొని గొడవ పడొద్దని అల్లుడ్ని ఆయన వారించారు. ఆగ్రహానికి గురైన గౌస్ కత్తెరతో మామ చెవిపై బలంగా పొడవడంతో పాటు తీవ్రంగా కొట్టారు. భార్య కన్ను, ఎడమ చెవిపై దాడి చేశారు. గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో బంధువులు చేర్పించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు నిందితుడు గౌస్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అహ్మద్‌జానీ పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు కుటుంబసభ్యులు అదే రోజున తిరుపతి రుయా హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు మరింత మెరుగైన వైద్యం అవసరమని చెప్పడంతో గత నెల 29న చెన్నై తీసుకెళ్లారు. అయినా పరిస్థితి మెరుగుపడకపోవడంతో కుటుంబసభ్యులు 31న నెల్లూరు కు తీసుకొచ్చి జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. నిందితుడి కోసం వేదాయపాళెం పోలీసులు గాలిస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	125	బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	242
లేయర్ (లైవ్) :	85		
బ్రాయిలర్ చికెన్ :	218	లేయర్ చికెన్ :	145



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి: రూ.17
సన్నవి: రూ.10
పండ్లు: రూ.4



బడ్జెట్ రూపకల్పనపై సమావేశం



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ అంచనాలను ప్రణాళికబద్ధంగా రూపొందించాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. బడ్జెట్ రూపకల్పనపై కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు, ఖర్చులను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఎంహెచ్‌ఓ వెంకటరమణ, ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఇన్‌చార్జి డీసీపీ ధనుంజయ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను వేగవంతం చేయండి

జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకంలో భాగంగా కార్పొరేషన్ పరిధిలో రీ సర్వేను వేగవంతం చేయాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో వార్డు సచివాలయ అడ్మిన్, ప్లానింగ్ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు.

ఇంటూరి బ్రదర్స్‌కు బెయిల్ మంజూరు

కందుకూరు: చంద్రబాబు నిర్వహించిన బహిరంగ సభలో జరిగిన తొక్కిసలాట ఘటనలో అరెస్ట్ అయిన ఇంటూరి బ్రదర్స్‌కి కందుకూరు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. తొక్కిసలాటలో 8 మంది అమాయకులు చనిపోవడానికి టీడీపీ కందుకూరు ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ ప్రధాన కారణమంటూ సెక్షన్ 304 (2), ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసులు పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లో ఉన్న ఇద్దరిని గురువారం సాయంత్రం అరెస్ట్ చేశారు. అర్ధరాత్రి వైద్యపరీక్షల నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. తర్వాత స్థానిక కోర్టులో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పూర్ణిమాదేవి ఎదుట హాజరు పరిచారు. ఇరువైపులా లాయర్ల వాదనలు విన్న న్యాయమూర్తి ఈ కేసులో పోలీసులు కోరిన విధంగా రిమాండ్ విధించేందుకు నిరాకరించి బెయిల్ మంజూరు చేశారు. రూ.10 వేల పూచీకత్తుపై విడుదల చేశారు.

సీపీయూ దొరికిందా?

సీతారామపురం: మండలంలోని బాలాయపల్లి సచివాలయం వద్ద కంప్యూటర్ సీపీయూ కనిపించింది. తహసీల్దార్ కార్యాలయంలో వారంరోజుల క్రితం చోరీకి గురైన సీపీయూ అదేనని ప్రచారం జరుగుతోంది. వివరాలిలా ఉన్నాయి. సీతారామపురం పంచాయతీలోని సర్వే నంబర్ ఒకటిలోని మేత పోరంబోకు భూమిలో 47 ఎకరాలు స్వాహాకు గురైందని అలజడి రేగడం, అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సీపీయూ చోరీకి గురికావడాన్ని సాక్షి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో ఉదయగిరి సీఐ గిరిబాబు విచారణ వేగవంతం చేశారు. శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని బాలాయపల్లి సచివాలయం వద్ద ఆరుబయట సీపీయూ కనిపించింది. దీనిని గుర్తించిన సచివాలయ సిబ్బంది పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి వెళ్లి సీపీయూను నెల్లూరుకు తరలించారు. అది రెవెన్యూ కార్యాలయానికి సంబంధించిందా? లేక వేరే వాళ్లదా అని తేలాల్సి ఉంది. భూముల స్వాహాకు సంబంధించి విచారణను ఆలస్యం చేసేందుకే ఆక్రమణదారులు పథకం ప్రకారం వేరే సీపీయూ పెట్టారా అనే విషయాలు విచారణలో వెలుగులోకి రానున్నాయి. ఈ విషయం మండలంలో చర్చనీయాంశమైంది.

క్లుప్తంగా

పెద్దల దీవెనలే శ్రీరామరక్ష



ఆశీస్సులను అందుకుంటున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: పెద్దల దీవెనలే తనకు శ్రీరామరక్ష అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 20వ డివిజన్లో గల షార్ కాలనీలో తటస్థుల దీవెన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించిన ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా సమస్యలకు పరిష్కారం చూపడమే తన లక్ష్యమని చెప్పారు. సమావేశానికి హాజరైన వారి నుంచి ఆశీస్సులను అందుకున్నారు. అనంతరం వారితో కలిసి ఆత్మీయ విందుకు హాజరయ్యారు. కార్పొరేటర్ మహేష్, ఇరుకళల పరమేశ్వరి ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

నెల్లూరు (టౌన్): డీఎస్సీ – 98 అభ్యర్థులకు పోస్టింగ్‌లను త్వరగా కల్పించాలని నిర్ణయం తీసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అభ్యర్థుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, తదితరులు శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలను తెలియజేశారు. నియామక ప్రక్రియకు సహకరించిన ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, తదితరులకు కృతజ్ఞతలను తెలిపారు.

వేడుకగా లక్ష తులసీ అర్చన

నెల్లూరు(బృందావనం): సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ మందిర ప్రాంగణంలో గల అష్టలక్ష్మి ఆలయంలో లక్ష తులసీ అర్చనను గణపతి సచ్చిదానందస్వామి అవధూత దత్త పీఠం నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. 400 కిలోలకుపైగా తులసీ దళాలతో.. ఏడు లక్షలకుపైగా నామజపంతో లక్ష తులసీ అర్చనను జరిపారు. అనంతరం రుద్రహోమం, అష్టలక్ష్మీ హోమాన్ని నిర్వహించారు. గణపతి సచ్చిదానంద కృష్ణజ్ఞాన బోధ సభ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో విశేష పూజలు



నెల్లూరు రూరల్: పౌర్ణమిని పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను శుక్రవారం నిర్వహించారు. స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. గరుడ వాహనంపై స్వామివారి గిరిప్రదక్షిణను జరిపారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివముక్కోటి



నెల్లూరు(బృందావనం): శివముక్కోటిని పురస్కరించుకొని నగరంలోని మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో కొలువైన నటరాజ స్వామి సమేత శివకామసుందరికి విశేషాభిషేకాలు, పూజలను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. మూలవర్లకు అన్నాభిషేకం చేశారు. అనంతరం స్వామివార్ల ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈఓ వేణుగోపాల్, ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

'డీకేడబ్ల్యూ'లో హిందీ దినోత్సవం

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. టర్కీలోని అంకార విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్రా ఆన్‌లైన్లో ప్రసంగించారు. ప్రిన్సిపల్ గిరి, హిందీ విభాగాధిపతి సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాపత్తు ఉత్సవం

నెల్లూరు(బృందావనం): అధ్యయనోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని రంగనాథ స్వామి దేవస్థానంలో రాపత్తు ఉత్సవాన్ని వేడుకగా శుక్రవారం నిర్వహించారు. స్వామివారు ఉభయదేవేరులతో ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్‌ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.

ప్రజల వద్దకే పాలన

• ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల వద్దకే పాలన ప్రస్తుతం అందుతోందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. 38వ డివిజన్లోని శోదన్‌నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిపై స్థానికులకు కరపత్రాలను అందజేశారు. స్థానికుల సమస్యలను ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల వారికి పథకాలను అందించేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. అర్హులై పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను పూర్తి చేశామని తెలిపారు. అనంతరం నేతలు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారితో కలిసి విందుకు హాజరయ్యారు. కార్పొరేటర్ అమృత, మాజీ మేయర్ భానుశ్రీ, అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్ చైర్పర్సన్ సైదానీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

నాడు – నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్: నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులను పూర్తి స్థాయిలో కల్పిస్తున్నారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో రూ.1.87 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనను వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మేయర్ స్రవంతితో కలిసి శుక్రవారం చేపట్టిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పనులను నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అదనపు తరగతి గదులు, పెయింటింగ్, హాల్, ఓపెన్ జిమ్ పనులను చేపట్టారన్నారు. కార్పొరేటర్లు వాసంతి, గౌరి, పార్టీ నేత శరత్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

స్పాస్టిక్స్ సెంటర్ విద్యార్థులకు వితరణ



యూనిఫారాన్ని అందజేస్తున్న దాతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లోని 110 మంది దివ్యాంగ విద్యార్థులకు రూ.70 వేల విలువైన రెండు జతల యూనిఫారం క్లాత్‌ను పీఎన్నార్ అధినేత సీతారామాంజనేయులు శుక్రవారం అందజేశారు. కుట్టు కూలీ నిమిత్తం రూ.30 వేలను పినాకినీ క్లబ్ ఆఫ్ నెల్లూరు అధ్యక్షుడు కుమార్ సమకూర్చారు. ఈ సందర్భంగా సీతారామాంజనేయులు మాట్లాడారు. స్పాస్టిక్స్ సెంటర్‌లోని దివ్యాంగులకు మరో రూ.లక్షను ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎమ్సీ మెంబర్ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపల్ గుర్నాథరావు, కన్వీనర్ వెంకురెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి, వైద్యుడు వాసు, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(సెంట్రల్): వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

సౌత్‌రాజుపాళెంలో వైద్య సేవలు



నెల్లూరు రూరల్: సౌత్‌రాజుపాళెం దళితవాడలో విషజ్వరాలు ప్రబలాయనే సమాచారంతో వైద్యసేవలను శుక్రవారం అందించారు. వైద్య సేవలను అందించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డిని ఫోన్ ద్వారా స్థానికులు కోరారు. ఈ క్రమంలో వైద్యసేవలను అందించారు. బాధితుల ఇళ్లకెళ్లి వైద్య పరీక్షలు చేశారు. జయవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వస్త్రాల అందజేత



నెల్లూరు(బృందావనం): సంక్రాంతిని పురస్కరించుకొని జేసీఐ నెల్లూరు టౌన్ సభ్యుడు మల్లికార్జున ఆధ్వర్యంలో వస్త్రాలను అందజేశారు. 20 మంది పారిశుధ్య కార్మికులకు వస్త్రాలను చిన్నబజార్‌లో శుక్రవారం పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో వెంకట్రావ్ ఆరాధన

నెల్లూరు(బృందావనం): గొలగమూడి వెంకయ్యస్వామి ప్రియశిష్యుడు మాకాని వెంకట్రావ్ ఐదో ఆరాధన మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. మూలాపేటలోని బ్రాహ్మణవీధిలో గల గురునిలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకయ్యస్వామి, వెంకట్రావ్ విగ్రహాలకు అభిషేకాలు, పూజలు చేశారు. నారాయణదాసు, వెంగమాంబ, వటుకనాథ స్వామి, హైకోర్టు న్యాయవాది చంద్రబాబు, పెంచలయ్య, గోపీ, తదితరులు పాల్గొన్నారు.

గిరిధర్‌రెడ్డికి సత్కారం



నెల్లూరు రూరల్: వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నియమితులైన నేపథ్యంలో పార్టీ శ్రేణులు సంబరాలను శుక్రవారం జరుపుకొన్నారు. బీవీనగర్, బట్వాడిపాళెం ప్రాంతాలకు చెందిన యువకులు నగరంలోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయానికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కార్యాలయ ఎదుట బాణసంచా కాల్చారు. అనంతరం గిరిధర్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు. వచ్చే ఎన్నికల్లోనూ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు పాటుపడతామని పేర్కొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిని వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

రాజేంద్రనగర్‌లో వైద్య శిబిరం



నెల్లూరు(బారకాసు): నగరంలోని రాజేంద్రనగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని బీజేవైఎం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ మోహన్ డయాబెటిస్ హాస్పిటల్ సహకారంతో శిబిరాన్ని జరిపారు. పలువుర్ని పరీక్షించి అవసరమైన వారికి మందులను అందజేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణ, శ్రీనివాసులు, స్వామి, రాము, సాయికుమార్, కార్తీక్, మధు, తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ కేంద్రం ప్రారంభం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల కోసం నగరంలోని రెవెన్యూ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన లైఫ్ సర్టిఫికెట్ సెంటర్‌ను జిల్లా డిప్యూటీ డైరెక్టర్ (ట్రెజరీస్) గంగాద్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు ఈ కేంద్రానికి వచ్చి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ వారు అందజేసే లైఫ్ సర్టిఫికెట్లను పొందవచ్చని తెలిపారు. అనంతరం పలువురికి సర్టిఫికెట్లను అందజేశారు. ఏటీఓలు అహ్మద్, లోకేష్‌బాబు, రమణారెడ్డి, నెల్లూరు జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచలరెడ్డి, నరసింహులు, వెంకటసుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మినేని శ్రీనివాసరావుకు అభినందన

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావును నగరంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో సీనియర్ అడ్వొకేట్ చంద్రశేఖర్ భరత్ మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. అనంతరం శాలువా కప్పి సత్కరించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్కేబీ చారిటబుల్ ఫౌండేషన్.. ఇందిరాగాంధీ సేవాసదన్ పేరిట ప్రారంభించనున్న సంస్థ క్యాలెండర్లను డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. నగరంలోని ఇందిరాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నేతలు మీరామొహిద్దీన్, జిలానీబాషా, ఖాజామస్తాన్, రెహ్మాన్, కరీమా, మస్తానీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ – 2 డీఈఈ మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరపురం, గాంధీగిరిజన కాలనీ, జనార్దన్‌రెడ్డికాలనీ, భగత్‌సింగ్‌కాలనీ, టిడ్కో గృహ సముదాయం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

• రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా సుబేదారుపేట, ఏబీఎం కాంపౌండ్, కపాడిపాళెం, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని వెస్ట్ – 2 ఏఈ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు.

అప్పు చెల్లించలేదని దాడి

నెల్లూరు(క్రైమ్): అప్పుగా తీసుకున్న నగదును తిరిగివ్వలేదనే కారణంతో వ్యక్తిపై కొందరు దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని మనుమసిద్ధినగర్‌కు చెందిన అనిల్ అదే ప్రాంతానికి చెందిన లక్ష్మీనారాయణ వద్ద నెల క్రితం రూ.300ను అప్పుగా తీసుకున్నారు. నగదును తిరిగివ్వాల్సిందిగా అనిల్‌ను ములుమూడి బస్టాండ్ వద్ద లక్ష్మీనారాయణ గురువారం కోరారు. తన వద్ద నగదు లేదని అనిల్ చెప్పడంతో లక్ష్మీనారాయణ, అతని ఇద్దరు కుమారులు, బావమరిది సీతారామయ్య, గుర్తుతెలియని కొందరు దాడి చేశారు. గాయపడిన అనిల్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

'జనహిత వాత్సల్య'కు విరాళం



నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని జనహిత వాత్సల్య ఆశ్రమానికి ప్రవాసాంధ్రులు జ్యోతి, జయంతిబాబు రూ.50 వేల విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని జెడ్పీ హైస్కూల్ విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు రేవతి తన కుమార్తె జ్యోతి తరఫున ఆశ్రమ కార్యనిర్వాహక కార్యదర్శి సాంబశివరావుకు అందజేశారు. శంకరయ్య, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు వేస్తే చర్యలు



సంక్షేమ పథకాలపై కరపత్రాలను అందజేస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వ నిర్ణయానికి విరుద్ధంగా ఫ్లెక్సీలను వేస్తే కఠిన చర్యలు తప్పవని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. తొమ్మిదో డివిజన్లోని నజీర్‌తోట, ఆర్కేనగర్, రంగనాథనగర్, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గ పరిశీలకుడు యల్లసిరి గోపాల్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పథకాలు అందని వారి నుంచి కారణాలను తెలుసుకొని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో యల్లసిరి గోపాల్‌రెడ్డి పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన అనంతరం దాదాపు మూడేళ్ల పాటు నగర నియోజకవర్గంలో ఫ్లెక్సీలను నిషేధించామని చెప్పారు. అనేక మంది తనపై విమర్శలు చేశారని.. తమ వైపు నుంచి ఎవరు ఫ్లెక్సీలు కట్టినా తొలగించామని గుర్తుచేశారు. అనంతరం కొన్ని పరిణామాల నేపథ్యంలో ఫ్లెక్సీల నిషేధాన్ని వదిలేశామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా ఫ్లెక్సీలు ఉండరాదని.. క్లాత్‌తో మాత్రమే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంచి నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. నిర్ణయాన్ని జనవరి 26 నుంచి అమలు చేయనుండటం శుభపరిణామమని వివరించారు. ఆ తర్వాత నగర నియోజకవర్గంలో ఫ్లెక్సీలను నిషేధించనున్నామని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం గోపాల్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే అనిల్ మంచి మనిషి అని, ముక్కుసూటిగా ప్రవర్తిస్తారని ప్రజలు తెలపడం సంతోషంగా ఉందన్నారు. సీఎంకు ఎమ్మెల్యే అనిల్ విశ్వాసపాత్రుడన్నారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, పార్టీ డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనిల్‌కు సత్కారం

నెల్లూరు(బృందావనం): తొమ్మిదో డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలో పర్యటించిన నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్‌ను పాండురంగ అన్నదాన సమాజ ఉపాధ్యక్షుడు బాలాజీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డైరెక్టర్ సుధీర్, పార్టీ నేత శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

వైఈఎస్ క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): యాదవ ఎంప్లాయీస్ సొసైటీ (వైఈఎస్) క్యాలెండర్లను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ నగరంలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. యాదవ ఎంప్లాయీస్ సొసైటీ వ్యవస్థాపకుడు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నేతలు శ్రీనివాసులు, వాసు, కోటేశ్వరరావు, జగదీష్, వెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

13న రంగనాథ, గోదాదేవి కల్యాణ మహోత్సవం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని టీవీఎస్ కల్యాణ సదన్‌లో రంగనాథస్వామి సమేత గోదా కల్యాణ మహోత్సవం, తిరుప్పావైను ఈ నెల 13న నిర్వహించనున్నామని సింహపురి సంక్రాంతి ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్షులు రంగరాజన్, సతీష్‌బాబు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను టీవీఎస్ కల్యాణ సదన్‌లో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఉష దంపతులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. భోగి సంబరాల్లో భాగంగా పిల్లలకు భోగిపండ్లు, వేదపండితుల ఆశీర్వచనాలను 14వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు అందజేయనున్నామని తెలిపారు. అనంతరం కమిటీని ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, సలహాదారులుగా ఫణిరత్నం, రమణయ్య, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, వాసుదేవరావు, భాస్కర్, మధుసూదన్, తదితరులను నియమించారు. సింహపురి గణేష్ ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు సత్యనాగేశ్వరరావు, సురేంద్రరెడ్డి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, హర్షవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెల్టీల సమస్యల పరిష్కారానికి కృషి



చంద్రశేఖర్‌రెడ్డితో అసోసియేషన్ నేతలు

నెల్లూరు (టౌన్): స్టేట్ లాంగ్వేజ్ టీచర్స్ (ఎస్సెల్టీ) సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని ఓ ఫంక్షన్ హాల్లో ఎస్సెల్టీఏ నేతలతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతును ఎస్సెల్టీఏ నేతలు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అసోసియేషన్ నేతలు ప్రధానంగా నాలుగు సమస్యలను తనకు తెలియజేశారని, వీటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య, ప్రధాన కార్యదర్శి శివానందరెడ్డి మాట్లాడారు. నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లోని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సమావేశమై సభ్యుల అభిప్రాయం మేరకు చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతును ప్రకటించామని చెప్పారు. తెలుగు, హిందీ ఉపాధ్యాయులు కలిసికట్టుగా ఉండి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన



నెల్లూరు (టౌన్): కౌమార దశలో ఆరోగ్య సమస్యలు.. నివారణ మార్గాలు అనే అంశంపై అవగాహన సదస్సును నగరంలోని కేఏసీ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. అనంతరం కుర్చీలను కళాశాలకు అందజేశారు. భాస్కర్‌రెడ్డి ఆస్పత్రికి చెందిన డాక్టర్ మధులతను సత్కరించారు. డాక్టర్ మునిరాజా, ఆర్ఐఓ వరప్రసాద్‌రావు, ప్రిన్సిపల్ గురవయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు ఎస్పీ పరామర్శ



నగదు సాయాన్ని అందజేస్తున్న విజయారావు

నెల్లూరు(క్రైమ్): లివర్ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ శాంతినగర్‌లోని తన ఇంట్లో కావలి రెండో పట్టణ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఉంటున్నారు. ఈ క్రమంలో ఆయన నివాసానికి ఎస్పీ విజయారావు శుక్రవారం వెళ్లి పరామర్శించారు. ఆపరేషన్‌కు అవసరమైన సాయాన్ని అందజేశారు. ఆపరేషన్ విజయవంతమై సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి అందరితో విధులు నిర్వర్తిస్తారని ఇన్‌స్పెక్టర్‌కు మనోధైర్యాన్ని కల్పించారు. ఏఎస్పీలు హిమవతి, శ్రీనివాసరావు, ఎస్ఈబీ జేడీ శ్రీలక్ష్మి, నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వీరాంజనేయరెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.